
ప్రజాశక్తి
శుక్రవారం 10 అక్టోబర్ 2025



65 విద్యాసంస్థల్లో నీటి నాణ్యతా పరీక్షలు

పార్వతీపురం : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, మంచినీటి వనరులు, బోరుబావులు, వసతి గృహాలు, కళాశాలల్లో మంచి నీటి నాణ్యత పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ అబ్దుల్ రజాక్ తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా తాగునీటి వనరుల్లో పరీక్షలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అక్టోబర్ 8 నుంచి మంచినీటి పరీక్షలకు శ్రీకారం చుట్టామని, బుధవారం నాటికి 15 మండలాల్లోని 65 విద్యా సంస్థల్లో నీటి నాణ్యతా పరీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఉన్న వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లు పరిశీలన ప్రారంభించినట్లు చెప్పారు. నీటి నాణ్యతకు వాటర్ ట్యాంకుల్లో ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని సంబంధిత అధికారులను తెలియజేశామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

జిల్లాలో ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కురుపాం మండల పరిషత్ కార్యాలయంతో పాటు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, దండుసూరలోని ప్రతి ఇంటినికలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వృద్ధులు, గర్భిణీలు, పిల్లలు, విద్యార్థులు, యువతతో ముచ్చటించారు. ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేసి, అందుతున్న వైద్యసేవల పట్ల వివరాలు అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారందర్నీ ఆసుపత్రిలో చేర్చామన్నారు. గత తొమ్మిది రోజులుగా పిల్లలందరికీ 2,3 విడతలుగా పరీక్షలు నిర్వహించి, ఎవరికైతే పచ్చకామెర్లు లక్షణాలు ఉన్నాయో అటువంటి వారిని ఆసుపత్రిలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైతే పాఠశాలలో చదివారో వారి గ్రామాలను, ఇళ్లను సందర్శించి పరామర్శిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 70 మందిని డిశ్చార్జ్ చేసి వారి ఇళ్లకు పంపించామని, ఈరోజు మరో 12 మంది డిశ్చార్జ్ కానున్నట్లు తెలిపారు. ఆరోగ్యంగా ఉండే వారిపై ఈవ్యాధి ప్రభావం ఉండదని, ఇది ప్రమాదకరమైంది కాదని ప్రస్తుతం అందరికీ అవగాహన వచ్చినట్లు చెప్పారు. అయినా ప్రతి విద్యార్థినికి ఎఎన్ఎం, కార్యదర్శి, వీఆర్ఒలను అటాచ్ చేస్తూ వారి బాగోగులను ప్రతి రోజూ తెలుసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. విద్యార్థులు కూడా స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారని, అనుమానంగా ఉన్నవారికి పరీక్షలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రమాదకరంగా దీనిపై ఎవరూ ఆందోళనపడాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చినట్లు స్పష్టం చేశారు.


కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఆ గ్రామంతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాల్లోను ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఇందులో భాగంగా మంచినీటి ట్యాంకులను, కాలువలను శుభ్రపర్చామన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం దృష్ట్యా ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, ప్రధాన ఉపాధ్యాయులు, స్థానిక ఎఎన్ఎం, ఎంఇఒలను బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు. పారిశుధ్యం, క్లోరినేషన్ పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా ఎక్కడికక్కడ ఇన్చార్జిలను నియమించి పరిశీలనకు, పర్యవేక్షణకు అధికారులను పంపి, వారి దగ్గర నుంచి నివేదికలను తెప్పించే కంట్రోల్ రూమ్ సిస్టమ్ ను అందుబాటులోకి తెచ్చినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఎఎన్ఎంలు ఎప్పటికప్పుడు రిపోర్ట్ చేసేలా విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ తీసుకునేలా పూర్తిస్థాయి సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, జిల్లాలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటున్నామని అన్నారు. పర్యటనలో పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కర రావు, ఇతర అధికారులు ఉన్నారు.



కురుపాం సిహెచ్‌సి వద్ద చిన్నారితో ముచ్చటిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కొమరాడలో జెసి పర్యటన

మండలంలోని ఉన్న పలు ఆశ్రమ పాఠశాలను జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, ఉలిపిరి ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ , విద్యార్థుల నివాస గృహాలు, వంటశాల పరిశుభ్రత , నిర్వహణ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు. విద్యార్థులు , వంట మనుషులు పాటించవలసిన పరిశుభ్రత అంశాల గురించి వివరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ లకు, ఆరోగ్య సిబ్బందికి వాటర్ టెస్టింగ్ తరచూగా చేయాలని ఆదేశించారు. కొమరాడ బాలుర పాఠశాలలో ఐసోలేషన్ చేయించిన ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పెట్టే భోజనం నుంచి తాగునీరు, వైద్యం అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంఇఒ-2 తిరుపతి రావు, గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తదితరులున్నారు.



కొమరాడ ఆశ్రమ పాఠశాల వద్ద వసతులను పరిశీలిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించాలి

కలెక్టరేట్ ఎదుట వామపక్షాల, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 8 గంటల పని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పలు వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, కౌలు రైతు సంఘం అధ్యక్షులు ఆర్.రమణ మూర్తి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వ కార్మిక చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను ఆమోదించిందని చెప్పారు. ఈ కోడ్‌లు అమలు చేయడంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం పనిగంటలు పెంచి కార్మికుల శ్రమను యాజమాన్యాలు మరింత దోచుకోవడానికి అవకాశం కల్పించిందని చెప్పారు. ఎక్కువ సెలవులు పొందేలా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పడం కార్మికులను మోసగించడానికేనని అన్నారు. కర్ణాటకలో అప్పటి బిజెపి ప్రభుత్వం మొదటగా 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు చేసి పని గంటలు రోజుకు 12 చేసిందని, వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారంలోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించబడతాయని చెప్పిందని తెలిపారు. అలాగే గుజరాత్‌లో 2025 జులైలో 12 గంటల పని దినం బిల్లు పాస్ చేసిందని చెప్పారు. అదే దారిలో మన రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నడుస్తోందన్నారు. కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా నేరుగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రపంచమంతా ఆమోదించిన 8 గంటల పని, 8 గంటలు కుటుంబం, సామాజిక కార్యక్రమాలు, 8 గంటలు విశ్రాంతి పద్ధతిని మార్పు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. 1948 పారిశ్రామిక చట్టం దేశంలో అమలు ప్రారంభమైన నుంచి 8గంటల పని దేశంలో అమలవుతుందని, అంతటి చారిత్రక నిర్ణయాన్ని బిజెపి, కూటమి ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసేలా 13 గంటలకు మార్చి, రాత్రి డ్యూటీలో మహిళలను కూడా పనిచేయమని చెప్పడం అత్యంత దారుణమని అన్నారు. ప్రభుత్వం పెంచిన పని గంటల బిల్లులు ఉపసంహరించాలనిచ కార్మిక చట్టాలను హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్ .వేణు, బివి రమణ, గొర్లి వెంకటరమణ, వి ఇందిర, ఎం.ఉమామహేశ్వరి, గేదెల సత్యనారాయణ, బంటు దాసు, సూరిబాబు, సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

కేసులు తగ్గుముఖం

పార్వతీపురం : అస్వస్థతకు గురైన విద్యార్థినుల కేసులు తగ్గుముఖం పట్టాయని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు వివరించారు. సీజనల్ వ్యాధులు, మందుల పంపిణీ, ఆసుపత్రిల్లో పరిశుభ్రత, ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ సేవలు, పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్ తదితర అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ బుధవారం వరకు 82 మంది విద్యార్థినిలను డిశ్చార్జ్ చేసి, వారి ఇళ్లకు పంపినట్లు తెలిపారు. మరి కొందరు గురువారం డిశ్చార్జ్ కానున్నారని, కేసులు పూర్తిగా తగ్గుతూ వస్తున్నట్లు కలెక్టర్ సిఎస్‌కు వివరించారు.

మలేరియా నివారణకు చర్యలు : కలెక్టర్

పార్వతీపురం: జిల్లాలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మలేరియా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తన కార్యాలయ సమావేశ మందిరంలో స్పెషలిస్టులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అందరూ తగు జాగ్రత్తలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మలేరియా ఉన్న గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంటి చుట్టూ నిలిచిపోయిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచిస్తూ, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దోమలు వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వాను చేయించాలనిన్నారు. దోమతెరలు వినియోగించుకునేలా సూచించాలని, రక్త పరీక్షలు జరిపి, నిర్ధారణ అయితే మందులు అందించాలని తెలిపారు.



మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి

- పిపిపి విధానాన్ని ఉపసంహరించు కోవాలి
- వామపక్ష, ప్రజాసంఘాల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్మించి నిర్వహించాలని కోరుతూ గురువారం వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించ దలిచిన పది మెడికల్ కాలేజీల నిర్వహణ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో విధానంలో చేయడం వల్ల వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని చెప్పారు. వైద్య విద్య అత్యంత ఖరీదుగా మారుతుందని, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులు పూర్తిగా రిజర్వేషన్లు కోల్పోతారని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో పిపిపి విధానం అమలు చేసిన ఏ పథకం విజయవంతం కాలేదని అలాంటి పద్ధతి వైద్య, విద్యరంగాల్లో ప్రవేశపెట్టి ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని విమర్శించారు. సుమారు రూ.5వేల కోట్ల విలువైన భూములను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించి వారి చేతిలో ఈ మెడికల్ కాలేజీలను పెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల ద్వారా సుమారు రూ.20వేల కోట్ల విలువైన వ్యాపారం చేసుకునేందుకు కార్పొరేట్ అధినేతలకు అవకాశం కల్పించడమే ఈ విధానం ఉద్దేశం తప్ప ప్రజలకు ఎలాంటి మేలు జరగదని అన్నారు. కొత్తగా ప్రవేశపెట్టదలచిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే ప్రారంభించి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిచో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ప్రజల్లో ప్రచారం నిర్వహించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.ఇందిర, ఆర్.వేణు, ఎం.కృష్ణమూర్తి, బివి రమణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం, సిపిఐ నాయకులు డివి నాయుడు, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు ఎం.ఉమామహేశ్వరి, కె.శివాని, బి.సూరిబాబు, కె.సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్ రమణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

షిప్ యార్డులో ఉద్యోగాలకు శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖపట్నం హిందూస్థాన్ షిప్ యార్డ్ కంపెనీలో ఉద్యోగాల కోసం 3 నెలల నైపుణ్య శిక్షణను ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విశాఖ స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ఐటిఐ అభ్యర్థులకు 3 నెలలు నైపుణ్య శిక్షణ ఇచ్చి షిప్ యార్డులో ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు 9676965949 నెంబరును సంప్రదించాలని ఆ ప్రకటనలో వివరించారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.17.98 లక్షలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని కోట దుర్గ అమ్మవారి హుండీ గురువారం లెక్కించగా 17 లక్షల 98 వేల 58 రూపాయలు ఆదాయం లభించింది. అదేవిధంగా మిక్స్ బంగారం 20 గ్రాములు, వెండి రెండు కేజీల 50 గ్రాములు లభించింది. ఆగస్టు 25 నుంచి ఈనెల 9 వరకు వచ్చిన ఆదాయంగా అధికారులు చెప్పారు. లెక్కింపులో జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్ రాజారావు, డివిజన్ తనిఖీ అధికారి రామారావు, ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

మక్కువ రహదారికి మహర్దశ

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నో ఏళ్లగా అధ్వానంగా ఉన్న సాలూరు -మక్కువ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. సాలూరు నుండి బాగువలస వరకు 9.2 కిలోమీటర్లకు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. నియోజకవర్గంలో ఈ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న సాలూరు -మక్కువ రోడ్డుకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పనులకు అడుగులు పడ్డట్టే అవుతుంది. ఈ ప్రాంతవాసులు సాలూరు నుంచి మక్కువ వెళ్లడానికి ఎన్నో ఏళ్లగా గుంతల రహదారి మీదుగానే అనేక అవస్థలు పడుతూ ప్రయాణించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ రహదారులపై వెళ్లాలంటేనే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. ఈ రహదారిలో బస్‌లు, లారీలు ఆటోలు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు చేస్తుండేవారు . ఈ గుంతలతో చాలామంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు గుంతల్లో పడి గాయాలైన దాఖలాలు కూడా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం హయాంలో 22 కిలోమీటర్లు గల ఈ రహదారికి సుమారు రూ.15 కోట్లు నిధులు కూడా మంజూరయ్యాయి. దీంతో ఈ రోడ్డు పనులను విశాఖకు చెందిన కన్స్ట్రక్షన్ కంపెనీకి టెండర్ దక్కింది. ఈ టెండర్ ను బొబ్బిలికి చెందిన శ్రీనివాస కన్స్ట్రక్షన్ కంపెనీ సబ్‌కాంట్రాక్ట్ తీసుకొని పనులు కూడా ప్రారంభించింది. కల్వర్టులను నిర్మించి రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను కూడా తొలగించారు. దీంతో పనులు కూడా చకచగా అవుతాయని ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో గాని ఈ పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత కొద్ది నెలలకు సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ పనులు పూర్తిగా ఆగిపోయి ఆ కాంట్రాక్టర్ కూడా బిల్లులు రాక చాలా ఇబ్బందులు పడ్డారు. వైసిపి ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ బిల్లులను ఆ కాంట్రాక్టర్‌కు చెల్లించింది. ఇంతటితో ఆ కాంట్రాక్టరు ఆ పనులను పూర్తిగా విడిచి పెట్టేశారు. ఆ తర్వాత ఈ ప్రాంత ప్రజలు స్థానిక మంత్రి గుమ్మడి సంధ్యారాణి వద్ద చాలాసార్లు ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని వేడుకున్నారు. దీంతో ఆమె 22 కిలోమీటర్ల రహదారికి అంచనాలు వేయించి మంజూరుకు పంపించగా అందులో ప్రభుత్వం మొదటి విడతగా 9.2 కిలోమీటర్లకు సుమారు రూ.5 కోట్లు నిధులను మంజూరు చేయించారు. దీంతో కొంతవరకైనా ఈ రోడ్డు నిర్మాణం సాగి ప్రయాణం కొంత నయమవుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు



అభివృద్ధి కానున్న మక్కువ- సాలూరు రోడ్డు

త్వరలో పనులకు టెండర్లు

సాలూరు నుంచి మక్కువ రహదారి నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం సాలూరు నుంచి భోగాపురం వరకు 9.2 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.ఐదు కోట్లు మంజూరు చేసింది. దీంతో త్వరలోనే టెండర్లు కూడా ప్రభుత్వం పిలుస్తుంది.

బి.విజయ్‌కుమార్, ఆర్అండ్‌బి జెఇఇ

టవర్ల పనులు ప్రారంభించండి : జెసి

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో జియో, బిఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు గుర్తించిన గ్రామాల్లో వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో ముందుగా టవర్ల పనులను ప్రారంభించాలని జాయింట్ కలక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సంబంధిత నెట్ వర్క్ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. అనుకూలమైన ప్రాంతాలకు టవర్ల మెటీరియల్ తీసుకువెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో 4జీ టవర్ల ఏర్పాటుపై బిఎస్ఎన్-ఎల్, జియో ప్రతినిధులతో పాటు సబ్ కలెక్టర్లు, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహశీల్దారులు, ఇంజినీర్లు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కొమరాడ మండలంలోని బద్దిడి, ఊటకోసు, తినుకు, ఊలిగేసు, వనబడి గ్రామాలు, సాలూరు మండలంలోని చోర, సురాపాడు, లోలింగభద్ర గ్రామాలు, గుమలక్ష్మీపురంలోని వడబాయి, బయ్యాడ గ్రామాల్లో టవర్ల ఏర్పాటుకు సర్వే చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ పది గ్రామాల్లో టవర్లకు సంబంధించిన మెటీరియల్‌ను తీసుకువెళ్లేందుకు వాహనాలకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో వెంటనే టవర్ల పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా రహదారి పనులు చేపట్టి, చిన్నపాటి నిర్మాణపు పనులు చేపట్టాల్సి ఉంటే, వాటికి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని అన్నారు. వాటిని ఉపాధిహామీ ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుర్తించిన ప్రదేశాల్లో టవర్ల ఏర్పాటుకు అవకాశం లేని ప్రాంతాలు ఉంటే, అధికారులు స్వయంగా పరిశీలించి వాటికి బదులుగా ప్రత్యామ్నాయ గ్రామాలను గుర్తించి తక్షణమే వివరాలను పంపాలని జెసీ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన పథకాలన్నీ ఇంటర్ నెట్‌తో ముడిపడి ఉన్నందున, గ్రామాల్లో ఇంటర్ నెట్ సమస్య లేకుండా చూడాలని నెట్ వర్క్ సంస్థలను ఆదేశించారు. టవర్లు ఉండి సిగ్నల్ సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని జెసి ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్. ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఎంజిఒ శ్రీనివాసరావు, కురుపాం, సాలూరు, జి.ఎల్.పురం, కొమరాడ, మక్కువ మండలాల తహశీల్దార్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాత వారికే కాంట్రాక్టులు

హారతి కర్పూరంలా కరిగిపోతున్న కోట దుర్గమ్మ ఆలయ ఆదాయం

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో ఉత్తరాంధ్ర ఆరాధ్యమైన కోట దుర్గమ్మ వారి దసరా నవరాత్రి ఉత్సవాలు గత నెల 22 నుంచి ఈనెల 2 వరకు జరిగాయి. లక్షలాది రూపాయలు ఈ ఉత్సవాలకు చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నప్పటికీ ఆదాయాన్ని హారతి కర్పూరం అహరించారన్న ఆరోపణ వినిపిస్తున్నాయి. పాత వారికే మళ్లీ కాంట్రాక్ట్ ఇచ్చి లక్షలాది రూపాయలు వారికి దారపోసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త వారికి అవకాశం ఇవ్వకుండా పాత వారికే కాంట్రాక్టర్లు కట్టబెట్టి లక్షలాది రూపాయలు బిల్లుల కింద ఇచ్చినట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా లైటింగ్ విషయంలో సుమారు పది లక్షల రూపాయల వరకు కేటాయించినట్లు తెలుస్తుంది. రూ.3లక్షలు కూడా అవ్వని లైటింగ్‌కి ఇంత భారీ మొత్తంలో నిధులు ఖర్చు పెట్టడం పట్ల సర్వత్రా విమర్శలను వినిపిస్తున్నాయి. ఆలయ సొమ్మును వృథాగా ఖర్చు పెట్టడం పట్ల పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

కిట్టు.. వాడితే ఒట్టు

రక్షిత మంచినీరు కరువు
రోగాల బారిన ప్రజలు

ప్రజాశక్తి - సాలూరు


ప్రజలకు సురక్షిత తాగు నీరు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు స్థానిక సచివాలయాలకు ప్రాథమిక నీటి నాణ్యత పరీక్ష కిట్లను అందజేసింది. వాటిని పూర్తిగా వినియోగించకపోవడంతో వాటి కాలపరిమితి ముగిసిపోయింది. ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు చేసి ప్రజలను అప్రమత్తత చేయాల్సిన అధికారులు వీటిని పూర్తిగా విస్మరించారు. వీరు చేసిన నిర్వాహకంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరక పోగా లక్షల రూపాయలు విలువైన నీటి నాణ్యత కిట్లు మూలన చేరి ప్రజాధనం వృథాగా పోతుంది. దీంతో కలుషిత నీరు తాగి ప్రజలు జ్వరాలబారినపడి ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో ఇటువంటి పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా నామమాత్రంగానైనా ఏ గ్రామంలోనూ పర్యవేక్షించాల్సిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడడంతో ప్రజలు వివిధ రకాల జ్వరాలు, విష జ్వరాలతో ఇబ్బందులు పడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. గత రెండేళ్ల కిందట సచివాలయాలకు ఇచ్చిన ఈ మంచినీటి నాణ్యత పరీక్ష కిట్లు మూలనపడేశారు. ఒక్కొక్క కిట్టు విలువ రూ.2500 వరకు ఉంటుంది. ఇవి 2013 ఫిబ్రవరి నుంచి 2017 ఫిబ్రవరి వరకు వినియోగించాలి. తేదీలు దాటిన తర్వాత ఇది వినియోగించడానికి పనికి రాకుండా పోతుంది. వీటిని ఎలా వినియోగించాలో, ఏ విధంగా తనిఖీలు నిర్వహించాలన్న అవగాహనను సచివాలయంలో ఉండే ఇంజినీర్ అసిస్టెంట్లకు శిక్షణ కూడా అప్పుడు ఇప్పించారు. శిక్షణ నిర్వహించిన అనంతరం సచివాలయాలకు ఈ కిట్లను అందజేశారు. కానీ వీటిని ఉపయోగించే దాఖలాలు ఎక్కడా కానరావడంలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో శూన్యంగా ఉంది.

మూలన పడ్డ మంచినీటి పరీక్ష నాణ్యత కిట్లు

గ్రామాల్లోని సరఫరా చేసే తాగునీటిలో సంపూర్ణ కఠినత్వం క్లోరైడ్ నైట్రేట్ ఫ్లోరైడ్ ఇనుము తదితర అంశాలపై ఎంత శాతం ఉందో గుర్తించడానికి పరీక్షలు చేయాల్సి ఉండగా చాలా చోట్ల ఇంజినీరింగ్ సహాయకులు చేయలేదు. నాణ్యత లేని నీరు తాగడంతో ప్రజలు టైఫాడ్, విరోచనాలు, కామెర్లు బారిన పడుతున్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురవడంతో కొత్త నీరు వచ్చి చేరుతుంది.

శుభ్రత చేయని మంచినీటి ట్యాంకులు

మండలంలో వందలాది తాగునీటి ట్యాంకులు గత కొన్నేళ్లుగా శుభ్రతకు నోచుకోలేదు. ఒక వైపు అధికారులు మంచినీటి నాణ్యత పరీక్షలు గాలికి వదిలేయక మరోవైపు పంచాయతీ సిబ్బందికి తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేసే ఉద్దేశమే కనిపించడం లేదు. దీంతో ప్రజలు కలుషిత తాగునీటిని తాగాల్సిన దుస్థితి. ప్రస్తుతం మండలంలో ప్రతి ఇంట్లోనూ విషజ్వరాలతో ప్రజలు విలవిలాడుతున్నారు. చెట్ల ఆకులు, పక్షుల మల విసర్జనలతో ట్యాంకుల్లో కుళ్లిన దుర్వసన కలిగిన నీరు సరఫరా అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రతి గ్రామంలో మంచినీటి ట్యాంకులను పరిశీలించి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరందించాలని కోరుతున్నారు.



శుభ్రతకు నోచుకోని రక్షిత మంచినీటి పథకం

నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరణ

ప్రజాశక్తి- సీతానగరం

విద్యారంగంలో బోధ నేతర కార్యక్రమాలు ఎక్కువ కావడం వల్ల బోధన సమయం హరించుకుపోతుందని దీంతో ఈ నెల 10వ తేదీ నుండి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తెలిపింది. గురువారం మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ఎంఇఒకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో మెమొరాండం సమర్పించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే చేస్తామని మిగతా బోధనేతర కార్యక్రమాలన్నిటినీ బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి బోధనేతర కార్యక్రమాల రద్దుకు తగు నిర్ణయం తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా ఫ్యాప్టో అధ్యక్షులు పువ్వల కూర్మినాయుడు, యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు, ఎపిటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి సల్ల సత్యంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఈనెల 10నుంచి బోధనేతర విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఇఒ-1 డి.గౌరునాయుడుకు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారన్నారు. మూల్యాంకనానికి సంబంధించి పరీక్షలు నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులను గానీ అవసరమైన గూగుల్ సీట్స్ నింపడం గానీ, విద్యాశక్తి, జిఎస్టి 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమని ఈ వినతిలో స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు మజ్జి పైడిరాజు, మండల మురళి, ధనుంజయనాయుడు, బి.దుర్గాప్రసాద్, ఎం.నరహరి, బి.రామారావు, కె.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: ఎంఇఒకు వినతినిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

చెరువులో సేద తీరిన ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలో గత 15 రోజులుగా తిష్ట వేసి ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తున్న ఏనుగుల గుంపు గురువారం ఎండ వేడిమికి తాళలేక లక్ష్మీనారాయణపురం పరిధిలో గల బోడికొండ సమీపానున్న మదిరాజ్ చెరువులో దిగి స్నానాలు చేస్తూ సేద తీరుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు గ్రామస్తులను ఎవర్నీ ఏనుగుల సమీపానికి వెళ్లొద్దని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 39 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జిఎఫ్ గేమ్స్‌లో సత్తా చాటారు. జిల్లా స్థాయి పోటీలు శ్రీకాకుళంలో జరుగు రాష్ట్ర స్థాయికి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో యోగాకు ముగ్గురు, ఆర్చరీకి ముగ్గురు అథ్లెటిక్స్ ముగ్గురు, ఖోఖో 12, బాస్కెట్‌బాల్ 16, వాలీబాల్ ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి హెచ్‌డబ్ల్యూ పాలక అమల, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శైలజ విద్యార్థులను అభినందించారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంత నర్సిపురం గ్రామానికి చెందిన కర్రి శ్రీరాములు రూ .44 వేల 182, చిట్టిపూడి వలసకు చెందిన బుడ్డి జగన్నాధరావులకు రూ.50 వేలు విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ భాస్కర్, బల్ల హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, మాచర్ల అనిల్, జంపు చంద్రశేఖర్, కొత్తకోట జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గురుకుల పాఠశాలలో మరణించిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించి వ్యాధి వ్యాప్తి పై సిట్టింగ్ న్యాయ మూర్తిచే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేశారు. గురువారం దళిత సంఘ నాయకులతో కలిసి పాఠశాల ముందు నిరసన తెలిపారు. అనంతరం పాఠశాలలో చోటుచేసున్న మరణాలు, వ్యాధులపై బాలికలు, వారి తల్లిదండ్రుల నుంచికీలక సమాచారం సేకరించి జరిగిన ఉపద్రవానికి ఉపశమన, పరిష్కార డిమాండ్ల తో కూడిన నివేదికను కురుపాం పర్యటనలో ఉన్న కలెక్టరు ప్రభాకర్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు జాజి ఓంకార్, బూల భాస్కర రావు, పి.నాగభూషణం, బొమ్మాళి సుందర్ రావు పాల్గొన్నారు.

దుమ్మంగిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుమ్మంగి గ్రామ పంచాయతీలో అన్ని గ్రామాలకు కొత్త విద్యుత్ లైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి పాలక క్రాంతికుమార్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం జరగడంతో ప్రజలు అంధకారంలో ఉండాల్సి వస్తుందని గుర్తించి విద్యుత్ మెరుగులకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వర్షాలు కారణంగా విషసర్పాలు ఇళ్లలోకి చొరబడుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌టి కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు భూషణ్‌రావు, బిజెపి కన్వీనర్ అప్పలస్వామి, లైన్మెన్ శేఖర్, ఎనర్జీ అసిస్టెంట్ పుష్పరాజ్ ఉన్నారు.

104 జిల్లా మేనేజర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

104 వాహనం వైద్య సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. మండలంలోని కుసిమి పిహెచ్‌సిలో గల 104 వాహనంలో ఎక్విప్మెంట్‌ను గురువారం ఆకస్మాత్తుగా తనిఖీ చేసి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు వివరాలను అడిగి వాహనంలో రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనీఖీ చేసి, పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది ఉన్నారు.

అన్ని రకాల మందుల ధరలూ తగ్గాయి

ప్రజాశక్తి- సాలూరు

కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు జిఎస్‌టి ధరలు తగ్గింపులో భాగంగా జిల్లాలో ఉండే అన్ని మందుల షాపులలో అన్ని రకాల మందుల ధరలూ తగ్గాయని దీనిని వినియోగదారులందరూ వినియోగించుకోవాలని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆషా షేక్ అన్నారు. గురువారం పట్టణంలో జిఎస్‌టి 2.0 అవగాహన కార్యక్రమాన్ని అన్ని మెడికల్ షాప్ యాజమానులతో కలిసి అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మెడికల్ షాప్ యాజమాన్యాలు కూడా ప్రభుత్వం తగ్గించిన ధరలను షాపు బయట బోర్డుల రూపంలో ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలో ఉండే అన్ని మందుల షాపుల యాజమానులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
భార్యకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. అప్పయ్యపేట గ్రామానికి చెందిన అంబటి సుధాకర్ (45) భార్య కళ్యాణితో కలిసి ద్విచక్ర వాహనంపై సీతానగరం నుంచి తన గ్రామానికి వెళు తుండగా సీతానగరం ఆర్ అండ్ బి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పార్వతిపురం నుండి బొబ్బిలి వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య కళ్యాణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికల సహకారంతో గాయపడిన భార్యను పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విజయనగరం తరలించారు. మృతి చెందిన వ్యక్తి సీతానగరం రేషన్ డీలర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయనకు లాస్య తొమ్మిదో తరగతి చదువుతున్న అమ్మాయి, 8వ తరగతి చదువుతున్న కొడుకు రోహిత్ ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటమునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో గల తెలగా వీధి రామ మందిరం పూజారిగా పనిచేస్తున్న సంగం చంద్రశేఖర్ మంగళవారం రాత్రి స్నానం కోసం బోటువాని చెరువులో దిగి కాలుజారి చెరువులోపడి మృతి చెందిననట్లు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. చంద్రశేఖర్ చెరువులో దిగిన సమయంలో ఎవరూ గుర్తించకపోవడంతో ఆయన్ను కాపాడేందుకు అవకాశం లేకపోయింది. ఈ మేరక కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బౌరోత్ సాయి(23) గడ్డి మందు తాగి మృతి చెందాడు. పోలీసులు చెప్పిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాయికి కాంచనతో వివాహమై 13 నెలలు అయ్యింది. భార్య భర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్ధలు రావడంతో బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై జి కళాధర్ తెలిపారు. తల్లిదండ్రులు మోహన్ రావు, విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంప్యూటర్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మ రైతు సేవా కేంద్రంలో సోమవారం రాత్రి తాళాలు పగలగొట్టి కంప్యూటర్లు దొంగలించిన దొంగలను కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు గురువారం పట్టుకుని కంప్యూటర్లను స్వాధీనపరుచుకున్నారు. కురుపాం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. కార్యాలయ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేయగా గురువారం గుమ్మ సమీపంలో గల చిట్టిగడ్డ ప్రాంతంలో గుమ్మ గ్రామానికి చెందిన బర్లి చందు, సింగమహంతి అవినాష్ అనే ఇద్దరు యువకులు పార్వతీపురంలో సుమారు లక్ష రూపాయలు విలువ చేసే కంప్యూటర్లు విక్రయించడానికి తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు పనులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు నుండి పూతికి వలస, ఈతమాను గూడ రహదారి పరమ అధ్వానంగా ఉందని, అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.తిరుపతిరావు అధికారులను కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ రోడ్డుపై ఎక్కడికక్కడ గోతులు ఏర్పడడంతో 43 గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 12 ఏళ్ల నుంచి మరమ్మతుకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారైందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాలికాభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - కొమరాడ

కౌమార దశలో బాలికల శారీరక, మానసిక సామాజిక అభివృద్ధిపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఐసిడిఎస్ సిడిపిఒ జి.సుగుణ కుమారి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కోటిపాం, విక్రమపురం జిల్లా పరిషత్ హైస్కూల్, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిషోర్ బాలికల వికాసం భాగంగా కౌమార దశలో ఉన్న బాలికలకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడలతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. బాలికలు ఎదుర్కొనే మోసాలు, బాల్య వివాహాలు, గర్భం వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శారదంబ, బంగారమ్మ, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, జ్యోతి, రాజి, తదితర బాలికలు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : విద్యార్థులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని మన్యం జిల్లా కెరీర్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ రేవెళ్ల అనంతరావు అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు కార్యక్రమంలో విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా తల్లిదండ్రులు ఒత్తిడి వల్ల తమ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అలా ఒత్తిడికి గురైన విద్యార్థులకు స్నేహితులు, ఉపాధ్యాయులు మీరు ఒంటరి కాదు మీకు మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చి ఒత్తిడి నుంచి దూరం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి. రామలక్ష్మి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



కొమరాడ: బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సుగుణ

ఆస్తుల పరిరక్షణ బాధ్యత పంచాయతీలదే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత పంచాయితీలదేనని ఎంపిడిఒ బి.వెంకటరమణ సర్పంచులు, కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి శిక్షణలో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు వచ్చే ఆదాయం ఏమిటి వాటిని ఏ విధంగా పరిరక్షించుకోవాలి, తద్వారా గ్రామాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. పంచాయతీకి వచ్చే ఆదాయాలపై ప్రణాళికలు రూపొందించుకోవా లన్నారు. ఈ సందర్భంగా నీలానగరం, యు.వెంకంపేట సర్పంచులు వావిలపల్లి పురుషోత్తం నాయుడు, ఎస్ శ్రీలక్ష్మి పంచాయతీకి అనుసంధానమైన చెరువులున్నాయి. వీటిలో చేప పిల్లల పెంపకాలు చేస్తున్నారని, వీటివల్ల పంచాయతీకి వచ్చే లాభం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఇందుకు ఎంపిడిఒ బి.వెంకటరమణ స్పందిస్తూ మత్స్యశాఖ సంబంధించిన సభ్యులుంటే నిబంధన ప్రకారం కొంత మొత్తాలను చెల్లిస్తారని, ప్రైవేటు వ్యక్తులైతే ప్రజల సమక్షంలో వేలంపాట వేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ ఎన్.నాగభూషణరావు పంచాయతీ కార్యదర్శుల విధులు హక్కులు చట్టాలు గురించి వివరించారు. తమ పరిధిలోన ఉండే ఆర్థిక వనరుల సేకరణ, చట్టాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. స్థానిక అవసరాల కోసం పంచాయతీలో ఉండే ఆర్థిక వనరులను సేకరించి వాటిని గ్రామాల అభివృద్ధికి సర్పంచులతో కలిసి వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కెజిబివిలో మానసిక ఆరోగ్య వారోత్సవాలు


ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థినులకు మానసిక ఆరోగ్యానికి మంచి అలవాట్లే ఆయుధాలని కెజిబివి ప్రత్యేక అధికారి జి.అరుణకుమారి అన్నారు. మానసిక ఆరోగ్యానికి మంచి అలవాట్లే ఆయుధాలు అనే వర్క్‌షాప్ స్థానిక కెజిబివిలో కౌన్సిలర్ గౌరీశంకర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మానసిక ఆరోగ్య సమస్యలపై అపోహలు స్టిగ్మా తొలగించడం, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న కౌన్సిలర్ గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. నేటి బాలికలు తరచుగా తల్లిదండ్రుల ఒత్తిడి, అంచనాలు, కమ్యూనికేషన్ లోపం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ భావాలను, సమస్యలను ఇతరులతో పంచుకోవడానికి ఇతరుల తీర్పు పట్ల భయం ప్రధాన అవరోధంగా మారుతోందని అన్నారు. ఈ భయాన్ని అధిగమించాలంటే, మనసులోని మాటను ధైర్యంగా చెప్పగలగాలని చెప్పారు. ఎస్ఒ అరుణకుమారి మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థినుల మానసిక ఆరోగ్యం ముఖ్యమన్నారు. తమ పాఠశాలలో ప్రతి విద్యార్థిని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామన్నారు. సమస్యలను దాచుకోకుండా, గురువులతో, కౌన్సిలర్లతో పంచుకోవడానికి భయపడకూడదని, మానసిక సమస్యలు ఎవరికైనా రావచ్చని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని, పరిష్కారానికి ప్రయత్నించడమే అసలైన విజయమని విద్యార్థినులకు హితవు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కురుకుట్టి జలపాతాన్ని పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని దళాయివలస, దిగువ మెండింగి వాటర్ ఫాల్స్‌ను పార్వతీపురం మన్యం జిల్లా డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధా రాణి గురువారం స్థానిక నాయకులు, వెలుగు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ముందుగా కురుకుట్టి దరి దళాయివలస వాటర్ ఫాల్స్ పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. వాటర్ ఫాల్స్ వెళ్లడానికి రహదారి పక్కన ఉన్న జంగిల్ క్లియరెన్స్ చెయ్యాలని, పర్యాటకులకు అవసరమైన మంచినీరుతో ఇతర స్నాక్స్, కూర్చోవడానికి వీలుగా సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సౌకర్యాలను కల్పిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా ఎంతో ఎంతో అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులకు ఆమె తెలియజేశారు. ఈ ప్రాంతాల పరిధిలో ఉండే మహిళా సంఘాలు సభ్యులు ఎవరైనా ఇక్కడ పర్యాటకులకు అవసరమైన వస్తువులు దొరికే విధంగా షాపులను నెలకొల్పనట్లయితే వారికి బ్యాంక్ నుండి రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. నలుగురు సభ్యులు ముందుకు వచ్చి షాపులు పెడతామని తెలియజేశారు. స్థానిక గ్రామం నుండి వాటర్ ఫాల్స్ వరకు పర్యాటకులను బైక్‌లు మీద తీసుకువెళ్ళడానికి నలుగురు యువకులు ముందుకు వచ్చారు. షాపులు పెడతామన్న సభ్యులకు బ్యాంకులు ద్వారా రుణాలు ఇప్పించాలని ఎపిఎం జయమ్మకు ఆదేశించారు. అనంతరం ఎగువమెండంగి వాటర్ ఫాల్స్ పరిశీలించి, పర్యాటకులకు ఇబ్బంది లేకుండా రహదారి, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఎపిఎంకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు జిల్లాలో అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి అక్కడ ఉండే యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కలిగే విధంగా శిక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం అంపల్లి జయమ్మ, సిసిలు లక్ష్మణరావు, భాస్కరరావు, సర్పంచ్ అప్పారావు, టిడిపి నాయకులు దొర లక్ష్మణరావు పాల్గొన్నారు.


వాటర్ ఫాల్స్‌ను పరిశీలిస్తున్న పీడీ

అంబేద్కర్ విగ్రహాన్ని పున:నిర్మించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అంబేద్కర్ జంక్షన్‌లో తొలగించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని పున:నిర్మాణ పనులు చేపట్టాలని గురువారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి ఎన్ సింహాచలం మాట్లాడుతూ ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల్లో భాగంగా అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని, తొలగించి నేటికీ రెండు సంవత్సరాలు కావస్తున్నా విగ్రహాన్ని పున నిర్మాణ పనులు చేయలేదని ఆయన అన్నారు. విగ్రహాన్ని తొలగించే తుప్పల్లో పడి వేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రహదారి విస్తీర్ణం పనులు పూర్తయిన వెంటనే తొలగించిన దేశ నాయకులు విగ్రహాలను పునర్మానం చేసి గౌరవించడం సంబంధించిన అధికారులపై ఉందని గుర్తు చేశారు. తక్షణమే ఎమ్మెల్యే స్పందించి అంబేద్కర్ విగ్రహం పునర్నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ప్రసాద్‌రావు, పడాల ప్రసాదరావు, సామంతుల నాగేశ్వరరావు, డి.వీరయ్య, భవిరి చిన్నయ్య, కుప్పిలి గడ్డయ్య, ఏడాకుల పకిర్నాయుడు, జోగులు, వెంకటేశుతదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి డిమాండ్లు నెరవేర్చాలని స్థానిక సచివాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆరేళ్ళుగా తాము విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం రోజురోజుకు పని భారం పెంచుతూ వస్తుందన్నారు. దీంతో తమ విధులకు కష్టంగా మారిందన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్న కనీసం పరిష్కారం చర్యలు చేపట్టడం లేదన్నారు. నోష్నల్ ఇంక్రిమెంట్లు, ఆరేళ్ల ఎఎస్ స్పెషల్ ఇంక్రిమెంట్, జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో చేపట్టే బదిలీల్లో ఎటువంటి పైరవీలకు, అవకతవకలకు తావు లేకుండా ఉపాధ్యాయ బదిలీల మాదిరిగా ప్రత్యేక పాలసీతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సీనియారిటీ లిస్టులు విడుదల చేయాలని, వికలాంగ ఉద్యోగులకు క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ విధుల నుంచి విముక్తి కల్పించాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫైనాన్సియల్ బెనిఫిట్స్ సాధన కోసం ఉద్యమం మరింత ఉధృతం చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. ఇకపై డోర్ టు డోర్ సర్వేయ్స్ పూర్తిగా బహిష్కరించనున్నట్లు స్పష్టత చేశారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఇలా ఉంటే వ్యాధులు రావా?

ప్రజాశక్తి - వీరఘట్టం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ముడిపడి ఉందని ఒకవైపు పాలకులు, అధికారులు చెబుతున్నా ఆ దిశగా చర్యలు లేకపోవడంతో విద్యార్థులు వ్యాధులు బారిన పడడం తప్పడం లేదు. ఇందుకు నిదర్శనం మండలంలోని చిట్టిపూడి వలసలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలకు వంటగది సౌకర్యం లేకపోవడంతో నిర్వహకులు ఆరు బయటన వంటలు చేసి విద్యార్థులకు భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి చూస్తుంటే కురుపాం గురుకుల పాఠశాలలో జరిగిన ఘటన గుర్తుకు వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు విద్యాశాఖ అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతున్నట్లు ప్రసంగాలకే పరిమితవుతున్నారు తప్ప విద్యార్థులకు కనీస సౌకర్యమైన వంటగది నిర్మించేందుకు వసతి సౌకర్యం లేకపోవడంతో నిర్వాహకులు ఆరు బయటనే వంటలు చేస్తున్నారు. అలాగే గడగమ్మ తదితర గ్రామాల్లో నిర్వాహకులు ఆరుబయట వంటలు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. ఈ విషయమై ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా వంట గదులు ఏఏ పాఠశాలల్లో లేవో వాటి వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నామని ఆయన తెలిపారు.


ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకురాలు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాలకొండ

శ్రీ విజయ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్ సంజీవ రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నమంగళపురంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు కురవడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, వాతావరణ పరిస్థితులు వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, అందుకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో చిన్న మంగళాపురం మాజీ సర్పంచ్ కిమిడి కాశీనాయుడు, జనసేనా నాయకులు గౌరునాయుడు, డాక్టర్ సాయి శంకర్, ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్, మార్కింగ్ మేనేజర్ బి.రవి, శ్రీకాంత్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధాంతాలపై దాడి క్షమించరానిది

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రోత్సాహంతోనే వైసిపికి చెందిన వారు అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేశారని, అది అంబేద్కర్ సిద్ధాంతాలపై దాడి అని, ఇది క్షమించరాని నేరమని ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర అన్నారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో వైసిపి పేటీఎం గాళ్లు అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేసిన ఘటనను నిరసిస్తూ గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాలభిషేకం, చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దళితుల కోసం పోరాడి వారికి సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించిన వ్యక్తి అంబేద్కర్ అని, దళితుల దృష్టిలో దేవుడితో సమానుడైన అంబేద్కర్‌ను అవమానించడం జాతీయ అవమానంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజంలో దళితులకు న్యాయం జరుగుతుందంటే అది అంబేద్కర్ పుణ్యమే అని అటువంటి వ్యక్తి విగ్రహాన్ని దహనం చేసేంత నీచానికి ఒడి కట్టడం సరికాదన్నారు. జగన్ జాతీయ దళిత ద్రోహిగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే దళితులంతా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే బోనెల, తదితరులు

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక సువర్ణముఖి నదిపై ఉన్న వంతెనపై గురువారం ఇరువైపుల నుండి ఒకేసారి వాహనాలు రాకపోకలు రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వంతెనపై భారీ వాహనాలు రావడంతో ఎదురుగా వచ్చిన వాహనాలు తప్పించుకోలేక అక్కడ ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. దీంతో పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.


వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు గిరిజన, విద్యార్థి, నిరుద్యోగ,ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సహా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ చనిపోయిన గిరిజన విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో గిరిజన సంక్షేమ విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గురువారం పార్వతీపురం లోని ఎపి ఎన్‌జిఒ భవనంలో గిరిజన విద్యార్థుల మరణాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, పీడిఎస్ఒ విద్యార్థి సంఘాలు, గిరిజన సంక్షేమ సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి రైతు సంఘం, కాంగ్రెస్, సిపిఐ లిబరేషన్ పార్టీ, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం ఐలూ, సంఘాల నాయకులు పాల్గొన్నారు. అక్టోబర్ 13 నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తామని తెలిపారు.

నేత్ర పరీక్షలు విధిగా చేయించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఒక్కరూ విధిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నేత్ర వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం నిర్వహించి కంటి పరీక్షలు చేపట్టి దృష్టి లోపం వున్న వారికి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న వారికి కళ్ళద్దాలు కోసం, కేటరాక్ట్, టెరిజియం, గ్లకోమా వున్నవారిని గుర్తించి మెరుగైన చికిత్సలు, శస్త్ర చికిత్సలు కోసం సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రులకు పంపిస్తున్నట్లు తెలిపారు. వారికి ఉచిత రవాణా, భోజనం, మందులు, కళ్లజోళ్ల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, ఆప్తాల్మిక్ అధికారి కృష్ణారావు, నేత్ర వైద్య సహాయకులు స్వాతి, నర్సింగ్ శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.